అభివృద్ధి పథంలో ఏలూరు

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో
- రూ.525కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం
- రూ.80కోట్లతో తమ్మిలేరుకు రివిట్‌మెంట్
- 31వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ
- రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో కొత్తరూపు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని నాయకత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది... అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా వైఎస్ జగన్ సర్కారు చర్యలు చేపడుతుంది. ఏలూరు చరిత్రలోనే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఎమ్మెల్యే ఆళ్లనాని నిలుస్తున్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు ఆదుకోవటమే కాదు, అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఏలూరు నగరంలో నాలుగేళ్లలో వందలకోట్ల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. నగరం రూపురేఖలు మార్చుతూ అనేక అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాని నాయకత్వంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ శ్రీకారం చుట్టారు.

రూ.525 కోట్లతో మెడికల్ కాలేజీ :

ఏలూరు జిల్లాకు తలమానికంగా ప్రజల చిరకాల కోరిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. వైఎస్ జగన్ సర్కారు రూ.525 కోట్ల అంచనాతో మెడికల్ కాలేజీ, సర్వజన ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని మెడికల్ కాలేజీ మంజూరులో కీలకపాత్ర పోషించారు. గతంలో టీడీపీ హయాంలో కేవలం మాటలకే పరిమితం కాగా, ఎమ్మెల్యే నాని చేతల్లో చూపించారు. రూ.38కోట్లతో ప్రస్తుతం ఏలూరు పాతబస్టాండ్ డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ విద్య సంవత్సరంలోనే మెడికల్ కాలేజీని ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.

రూ.80కోట్లతో తమ్మిలేరు రివిట్‌మెంట్

ఏలూరు నగరవాసులకు దుఃఖదాయినిగా పేరొందిన తమ్మిలేరు వరదముంపుకు ఎమ్మెల్యే ఆళ్ల నాని శాశ్వత పరిష్కారాన్ని చూపించారు. గతంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఆనాడు సుమారుగా రూ.60కోట్లతో తమ్మిలేరుకు రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టగా, రెండవ దశలో తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రూ.80కోట్లను మంజూరు చేశారు. వీటితో సుమారుగా 4.6కిలోమీటర్ల మేర తమ్మిలేరు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణం పూర్తి చేశారు. వర్షాలు వస్తే చాలు నగర ప్రజలు తమ్మిలేరు వరద ముంపుకు భయపడి బిక్కుబిక్కుమంటూ జీవించే పరిస్థితులకు శాశ్వతంగా చెక్‌పెట్టారు.



ఏలూరు నగరంలో తమ్మిలేరు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణం

రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్

ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాని ప్రత్యేక శ్రద్ధతో అనేక అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. నగరంలోని పలు ప్రధాన రహదారులను అభివృద్ధి చేయటంతో పాటు, ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్, డివైడర్‌లను ఏర్పాటు చేశారు. ఏలూరు జీవీమాల్ సెంటర్ నుంచీ పత్తేబాద రోడ్డు, ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం రోడ్డు, ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచీ పవర్‌పేట రైల్వేస్టేషన్ రోడ్డు, శనివారపుపేట రోడ్డు, వన్‌టౌన్‌లో చాటపర్రు రోడ్డుల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్, అర్బన్ హెల్త్ సెంటర్లు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇలా అనేక అభివృద్ధి పనులు ప్రగతిలో ఉన్నాయి.

పేదలకు ఇళ్లు



ఏలూరు నగరంలో ప్రతి పేదవానికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆళ్లనాని నాయకత్వంలో 31వేల ఇళ్ల పట్టాలు పేదలకు పంపిణీ చేశాం. కొమడవోలు, పోణంగి, చొదిమెళ్ళ ప్రాంతాల్లోని జగనన్న లేఅవుట్లలో సుమారుగా 17వేల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవానికీ మేలు చేయాలనే సంకల్పంతో పేదల ఇళ్ల స్థలాలకు భూములను వందలకోట్లతో కొనుగోలు చేసి పేదలకు పంచుతున్నారు.

– షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్ :

మెరుగైన వైద్యం



పేదలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్, వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లీనిక్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో రూపాయి ఖర్చు లేకుండా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఆధ్వర్యంలో నగరంలోనూ విలేజ్‌క్లీనిక్స్, హెల్త్ సెంటర్లు నిర్మాణం చేస్తున్నారు. 108, 104 వాహనాలతో సేవలు అందిస్తున్నారు.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏలూరు డిప్యూటీ మేయర్

మెడికల్ కాలేజీ చిరకాల కోరిక



ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం కేవలం ఎమ్మెల్యే ఆళ్లనాని కృషితోనే సాధ్యమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏలూరు తీసుకువచ్చి శంకుస్థాపన చేయటంతోపాటు నేడు ప్రారంభోత్సవానికి సమీపంలో ఉంది. ఏలూరు నగరం అభివృద్ధిలో ఆయన ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వందలకోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు ఆధునిక వైద్య సేవలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.

– వైఎస్‌పీ శివరావు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

తమ్మిలేరుకు శాశ్వత పరిష్కారం



ఏలూరు నగరంలో తూర్పు, పశ్చిమ రెండు బాగాలుగా విడిపోతూ తమ్మిలేరు ప్రవహిస్తోంది. వర్షాలు, తుఫానులు వస్తే తమ్మిలేరు వరద భీభత్సానికి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. కానీ ఎమ్మెల్యే ఆళ్లనాని చొరవతో తమ్మిలేరు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణం చేయటం ద్వారా శాశ్వత పరిష్కారం చూపించారు. అదేవిధంగా నగరంలో ప్రధాన డ్రెయిన్లకు రివిట్‌మెంట్ నిర్మాణం చేయటం, రోడ్లు అభివృద్ధి చేయటం విశేషం.

– గుడిదేశి శ్రీనివాసరావు, ఏలూరు నగర డిప్యూటీ మేయర్



ఏలూరు పాతబస్టాండ్ డీఎంహెచ్‌వో ఆఫీస్ వద్ద నూతనంగా నిర్మిస్తోన్న మెడికల్ కాలేజీ భవనం



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయ రోడ్డులో జిగేల్‌మనేలా సెంట్రల్ లైటింగ్

క్లుప్తంగా

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మండలపరిషత్ కార్యాలయంలో మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: మండలంలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఆయన ఏలూరు మండలపరిషత్ కార్యాలయం మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలో లక్షలాది రూపాయలు నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైయినేజీ, తాగునీటి ట్యాంకుల నిర్మాణాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. స్థానిక ఎంపీటీసీల సహకారంతో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, ఏఓ వై విజయతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మైసన్నగూడెంకు చెందిన వల్లూరి లక్ష్మీకుమారికి ముగ్గురు మగసంతానం. ఆమె చిన్నకుమారుడు వల్లూరి దుర్గాప్రసాద్‌కు వివాహమై ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. మే 31వ తేదీన లక్ష్మీకుమారి చిన్న కోడలు తండ్రి అయిన ఉండ్రాజవరపు దుర్గయ్య సదరు ఆడపిల్లల విషయంలో లక్ష్మీకుమారితో గొడవపడి కిందపడవేశాడన్నారు. అతని వెంటే ఉన్న తగరం పుల్లయ్య అనే వ్యక్తి కర్రతో లక్ష్మీకుమారిని తీవ్రంగా గాయపర్చాడన్నారు. గాయపడిన లక్ష్మీకుమారి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిందని, ఆ మేరకు లక్ష్మీకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఎంపీడీవోగా రాజ్‌మనోజ్ పూర్తి బాధ్యతల స్వీకరణ

పెదవేగి : ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న గంజి రాజ్‌మనోజ్ గురువారం పెదవేగి ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీపీ తాతా రమ్యకుమార్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువలో ఉండి సేవలు అందించాలని ఆకాంక్షించారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కూరపాటి విక్టర్ జాన్సన్, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, పెదవేగి పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్, కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ మాదు రామకృష్ణ తదితరులు ఎంపీడీవో రాజ్‌మనోజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	05-08
బెండకాయలు	28	కంద	56
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	34
కాకర కాయలు	50	కీరా దోస	40
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	40
బీరకాయలు (పందిరి)	--	అల్లం	220
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	10	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	21

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	18
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	35
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	36
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

పెడన మున్సిపల్ కమిషనర్‌గా మహేంద్ర



బంటుమిల్లి మహేంద్ర

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తోన్న బంటుమిల్లి మహేంద్రను కృష్ణాజిల్లా పెడన పురపాలక సంఘానికి కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఏలూరు నగరంలో విశేష సేవలు అందిస్తూనే, మరోవైపు తన ఉద్యోగంలో వర్గోన్నతి పొందేందుకు ఆయన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తూ విజయం సాధించారు. ఒకవైపు సర్వీసులో సీనియార్టీ సాధించటం, మరోవైపు ఉన్నత విద్యను అభ్యసించటం ద్వారా శానిటరీ ఇన్స్‌పెక్టర్ నుంచీ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందటం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా కృషి చేస్తానని చెప్పారు. చిన్నపాటి ఉద్యోగంలో చేరి నేడు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషాన్నిస్తుందన్నారు.

గ్రూప్1, 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే గ్రూప్-1 , గ్రూప్ -2 పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థుల కోసం అమిగోస్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో ఉన్న తమ అకాడమీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందన్నారు. ఈ సదస్సులో గ్రూప్-1,గ్రూప్-2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్స్ మేకింగ్, సమయ పాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులచేత సమగ్ర అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సదస్సు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇతర వివరాల కోసం 04035052121, 9000230734 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

బదిలీల విషయంలో అసంతృప్తి

ఏలూరు(మెట్రో): బదిలీల విషయంలో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్ర రాజు, కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో బదిలీలు జరగాల్సి ఉన్న, నూతన జిల్లాల పరిధిలో ఉద్యోగులు మారాలని భావిస్తే తప్ప బదిలీలకు సాధ్యం కాదని అధికారులు చెప్పడంతో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అన్యాయం జరుగుతోందని వాపోయారు.

మలేరియా జ్వరాలపై అశ్రద్ధ వద్దు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆశ



బ్యానర్ ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో డాక్టర్ ఆశ, మలేరియా అధికారి ప్రసాద్

ఏలూరు టౌన్: మలేరియా జ్వరాలు పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డీ.ఆశ, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా బ్యానర్‌ను గురువారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మలేరియా జ్వరాలు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఉన్నాయనీ, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో అత్యధికంగా మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. మలేరియా జ్వరాలను అశ్రద్ధ చేస్తే మరణాలు సంభవిస్తాయని, మలేరియా జ్వరాన్ని చలి జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. మలేరియా కారక దోమ ఆడ అనాఫిలిస్ ఇంటిలోపల ఇంటి బయట ఉండే మంచినీటి నిలువ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలైన నీళ్ల తొట్లు కడిగి మూతలు పెట్టుకోవాలనీ, రుబ్బురోళ్లు, డ్రమ్ములు నిత్యం శుభ్రం చేసుకోవాలన్నారు.జూన్ నెలంతా పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మలేరియా చాలావరకు తగ్గుముఖం పట్టిందనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తారనీ, మందులు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రత్నకుమారి, ఏవో మురళీకృష్ణ, డీపీహెచ్ఎన్‌వో మనోరమ, డెమో నాగరత్నం, విజయ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సిబ్బంది ఉన్నారు.

పల్లె పయనం పోస్టర్ల ఆవిష్కరణ

దెందులూరు : రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొలిమేర హరికృష్ణ పల్లె పయనం పేరుతో ముద్రించిన పోస్టర్లను గురువారం దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలు ఆర్థికంగా వెనుకబడి సాధారణ, ఉన్నత విద్యలకు దూరంగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న అనేక విద్యా పథకాలను అందిపుచ్చుకుని ప్రతి ఇంటిలోనూ చిన్నారులను తల్లిదండ్రులు విధిగా పాఠశాలలకు పంపి తమ బిడ్డలను చదవించాలన్నారు. పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ పేదవర్గాల చిన్నారులంతా బాలకార్మికులుగా, కూలీలుగా మారి వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, పల్లె పయనం పేరుతో విద్యాభివృద్ధి, విద్య ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, దళిత పెద్దలు తదితరులు ఉన్నారు.

అల్లం.. ధర ప్రియం

గణపవరం : అల్లం ఘాటెక్కింది. పది రోజులుగా అల్లం ధరలకు రెక్కలొచ్చాయి. నిత్యావసరమైన అల్లాన్ని సామాన్యుడు కొనలేని స్థితికి చేరింది. ప్రస్తుతం మార్కెట్లో అల్లం కిలో రూ.300 పలుకుతుంది. ఏనాడు రూ.150కు మించని అల్లం ధర ఒక్కసారిగా రెట్టింపవడంతో ప్రజలు దీని వినియోగం కూడా సగానికి సగం తగ్గించేశారు. ఒకవైపు శుభకార్యాలు, మరోవైపు పచ్చళ్ల సీజన్ కావడంతో అల్లానికి డిమాండ్ పెరిగింది. అయితే డిమాండ్‌కు సరిపడ సప్లయి, ఉత్పత్తి లేకపోవడంతోనే అల్లం ధరకు రెక్కలొచ్చాయని వ్యాపారులంటున్నారు. గతనెలలో కిలో రూ.150 పలికిన అల్లం ధర, ఇరవై రోజుల క్రితం వరకూ పెరుగుతూ కిలో రూ.250కు చేరి, ప్రస్తుతం రూ.300 పలుకుతోంది. హోల్‌సేల్ మార్కెట్లో సైతం కిలో రూ.260 పలుకుతోంది. అల్లం ధర ప్రియం కావడంతో ఆచితూచి వాడుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ధర మరో నెలరోజుల వరకూ ఇలాగే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

వైష్ణవి కళాశాలపై చర్యలు తీసుకోవాలి



ఆర్ఐఓకు వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక నరసింహరావుపేటలో ఎస్‌వీఆర్‌కే కళాశాల జూనియర్ కళాశాల పేరుతో నిర్వహిస్తున్న కళాశాలకు ఉన్నట్టుండి వైష్ణవి కళాశాలగా పేరు మార్చి నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నందున ఆ కళాశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఏలూరు నగర శాఖ ప్రతినిధులు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే. చంద్రశేఖర బాబును కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర శాఖ అధ్యక్షుడు ఎం.క్రాంతికుమార్ మాట్లాడుతూ ఎస్‌వీఆర్‌కే పేరుతో నిర్వహిస్తున్న కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులూ తీసుకోకుండానే వైష్ణవి జూనియర్ కళాశాలగా మార్చి తల్లిదండ్రులను, విద్యార్థులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైష్ణవి కళాశాల యాజమాన్యం చేసిన నిబంధనల ఉల్లంఘనపై శాఖాపరమైన విచారణ చేపట్టి, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఐఓకు వినతిపత్రం సమర్పించిన వారిలో పీడీఎస్‌యూ నగర నాయకులు ఆర్. తేజ, కే. రాజు ఉన్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి



మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని వారికి మద్దతుగా ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని, వారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక జన్మభూమి పార్క్ సెంటర్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్. లింగరాజు, శ్రామిక మహిళ నాయకులు పీ. హేమావతి, రైతు సంఘం నాయకులు కే.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులను పోలీసులు అమానుషంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. దేశానికి పతకాలు తెచ్చిన మహిళా యోధులకే రక్షణ లేకపోతే సాధారణ మహిళలకు ఏ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. నిరసన తెలిపే రెజ్లర్లకు రక్షణ కల్పించాలని, రిటైర్డ్ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, వీ. సాయిబాబు, కే.విజయలక్ష్మి, సీహెచ్. సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

మురి'పింఛన్'



ఏలూరు నగరంలో గురువారం వేకువ జాము నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏలూరులో లంక అన్నపూర్ణకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ ఎల్.సౌజన్య.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

అధికారుల అనుమతితో మట్టి తీసుకోవాలి

ఏలూరు రూరల్: గ్రామ పంచాయతీ లేదా రెవెన్యూ అధికారుల అనుమతితోనే మట్టి తవ్వకాలు చేపట్టాలని ఏలూరు తహసీల్దార్ బి సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆయన ఏలూరు మండలం చాటపర్రు జనార్దనస్వామి చెరువు మట్టి తవ్వకాలను పరిశీలించారు. పంచాయతీ పాలకవర్గం అనుమతి పొంది ప్రజలు, రైతులు తమకు అవసరమైన మట్టి తరలించుకోవాలన్నారు.